క్లుప్తంగా

సూర్పరాజు మృతికి సంతాపం



రమేష్‌రాజు సోదరులను పరామర్శిస్తున్న వాసుబాబు, పార్టీ నేతలు

గణపవరం: కాశిపాడు గ్రామ ప్రముఖుడు జంపన సూర్పరాజు మరణం గ్రామానికి తీరనిలోటని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఇటీవల మరణించిన సూర్పరాజు కుటుంబ సభ్యులను వాసుబాబు, మండల పార్టీ కన్వీనర్ దండు రాము తదితరులు సోమవారం పరామర్శించారు. సూర్పరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సూర్పరాజు కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌రాజు, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిన్నం సిల్వెస్టర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



సీతంపేటలోని ఓ ఇంటిలో నీటి తొట్టెలను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది

దెందులూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. మంగళవారం సీతంపేటలోని ఇళ్లల్లో తొట్టెలు, పూల కుండీలు పరిశీలించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలు గమనించినా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఆయన వెంట పోతునూరు వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

డివిజనల్ పంచాయతీ అధికారిగా సూర్యకుమార్



జిల్లా పంచాయతీ అధికారిని కలుసుకున్న డీఎల్‌పీఓ సూర్యకుమార్

పెదపాడు: ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారిగా పెదపాడు ఈఓఆర్డీ సూర్యకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పంచాయ తీ రాజ్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ అధికారి కె అనూరాధను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన్ను పెదపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మేకా శ్రీనివాస్, డీ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పై వంతెన నిర్మాణానికి సర్వే వేగవంతం



కైకరంలో పై వంతెన నిర్మాణం కోసం సర్వే చేస్తున్న అధికారులు

ఉంగుటూరు: కైకరంలో పై వంతెన నిర్మాణం కోసం సర్వే పనులు వేగవంతమయ్యాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నివాసితులు 2018లో కోర్టును ఆశ్రయించడంతో ఎంతోకాలంగా ఈ బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోయింది. చివరికి ప్రభుత్వానికి అనుకూలంగానే కోర్టు తీర్పు వెలువడటంతో తిరిగి సర్వే పనులు ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ ఏలూరు రోడ్డు వైపు హోటల్ దాటాక పొలాల్లో ఉన్న సమాధులు ఎదురుగా బ్రిడ్జి ప్రారంభమై తూర్పున కైకరం బీసీ కాలనీ సమీపం వరకు బ్రిడ్జి రానుంది. సుమారు 60 మీటర్లు చొప్పన భూమి అవసరం కానుంది. బ్రిడ్జి వెంబడి అప్రోచ్ రోడ్డు రానుంది. సుమారు 5 ఎకరాలు భూమిని నివాసితులు, రైతులు వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. సోమవారం నిర్వహించిన సర్వేలో మండల సర్వేయర్ విశ్వనాథం, హైవే డీటీ సత్యనారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఆఫ్‌సర్వేయర్ టీబీఎస్‌వీ రమణరావు, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరు (టూటౌన్): వర్షాల నేపథ్యంలో ఏలూరు కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ సోమవారం పేర్కొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు తగు సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సహాయ సహకారాలు అవసరమైతే ఫోన్ నంబర్లు 08812-232101, 08812-222200లో సంప్రదించాలన్నారు.

పత్తి సాగు.. లాభాలు బాగు

- అందుబాటులోకి సాంకేతిక పరిజ్ఞానం
- డ్రోన్లతో మందులు పిచికారీ
- సంతృప్తికరంగా దిగుబడి



ఫలదీకరణం చేసిన చెట్లకు గుర్తుగా రెడ్ స్టిక్కర్లు వేసిన దృశ్యం



ఫలదీకరణం చేస్తున్న కూలీలు



పత్తి కాయ

దెందులూరు: పత్తి పంట దెందులూరు నియోజకవర్గంలో సాగు రైతుల పాలిట బంగారంగా మారింది. దెందులూరు నియోజకవర్గం పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. మారిన వాతావరణం, భూసార పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో క్రమేపీ సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేశారు. దీంతో ప్రస్తుతం పొలాల్లో మందులు స్ప్రే చేయడానికి డ్రోన్లను వినియోగిస్తున్నారు. రైతులు పూర్తి స్థాయిలో నూతన సాంకేతిక పరికాల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో దాదాపు 188 ఎకరాల్లో సీడ్ పత్తి సాగు చేస్తున్నారు. దెందులూరు మండలంలో రామారావుగూడెం, మేధినరావుపాలెం, పెరుగ్గూడెం, సీతంపేట, చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెం, ఇతర గ్రామాల్లో సాగు చేస్తున్నారు. అన్ని ఖర్చులతో కలిపి ఒక ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. లాభం అన్నింటితో కలిపి మూడు రెట్లు వస్తుంది.

పత్తి సాగు విధానం

ఒక ఎకరానికి 15 మంది మహిళా కూలీలు పనిచేస్తారు. వారికి ఒక్కొక్కరికీ రూ.300 కూలీ ఇస్తారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటలకు పత్తిలో పోతుపువ్వు సేకరించి ఉదయం 9 గంటల వరకు ఆరబెట్టాలి. సేకరించి ఆరబెట్టిన పత్తి మగ పువ్వులు చెట్లకు ఉన్న ఆడ పువ్వులను ఫలదీకరణ చేసి దానికి గుర్తుగా ఎరుపు స్టిక్కర్ వేస్తారు. సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు ఆ ఎరుపు స్టిక్కర్లను తీసేసి మరో చెట్టు స్టిక్కర్ వేస్తారు. ఈ విధంగా కూలీలు 80 రోజులు చేస్తారు. 80 రోజులు అనంతరం దూది ఒక ఎకరానికి 3 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కొన్ని కంపెనీలు క్వింటాకు రూ.35 వేలు ఇస్తున్నారు. మరికొన్ని కంపెనీలు రూ. 45 వేల ధరను ఇస్తున్నారు. పత్తి సాగు గతంలో రైతులకు ఆసక్తి లేదు. సాగు కూడా తక్కువగా చేసేవారు. మెట్ట ప్రాంతాల్లో ప్రస్తుతం రైతులు ఆరతడి పంటల్లో అధిక దిగుబడులు చేసి అద్భుతాన్ని సృష్టిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు అధికంగా పత్తి సాగును ఎంచుకుని లాభాల బాటలో పయనిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో పత్తి సాగులో ఎక్కడా నష్టం వచ్చిన దాఖలాలు లేవు. లాభాలు వస్తే 3 రెట్లు ఎలా వస్తాయో అలాగే ఒక్కోసారి పూర్తిగా నష్టం వచ్చే పరిస్థితి ఈ పంటలో ఉంది. నియోజకవర్గంలో అర ఎకరం యజమానులు అధికంగా పత్తి సాగును ఎంచుకున్నారు. పత్తి విత్తనాలను డీలర్ల ద్వారా ఆర్గనైజర్లు సరఫరా చేస్తున్నారు. రైతులకు విత్తనాలు ఇచ్చి పంట పండించి ఫ్యాక్టరీలకు తరలించే వరకు కమిషన్ల ప్రాతిపదికన రైతులకు సాగుకు అవసరమైన పెట్టుబడి అందిస్తారు. కమిషన్ల కోసం రైతులకు అవసరమైన ఎరువులు డీలర్లు, ఆర్గనైజర్లు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత, మెట్ట ప్రాంత, సన్న, చిన్నకారు రైతులు పత్తి సాగు వైపు దృష్టి సారిస్తున్నారు.

25 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నాం



నియోజకవర్గంలో 25 ఏళ్ల నుంచి పత్తి సాగు చేస్తున్నాం. పూర్తిస్థాయిలో ఆశాజనకంగా ఉంది. దిగుబడులు సైతం సంతృప్తికరంగా ఉన్నాయి. ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని ఇస్తే రైతులు మరింత సాగు చేసేందుకు ముందుకు వస్తారు. పత్తి రైతులను ఇటీవల సాగు చేసే సంఖ్య పెరిగింది.

– పేరం ప్రసాద్, పత్తి రైతు, రామారావుగూడెం

రైతులకు ఆర్థికంగా లబ్ధి



పత్తి సాగు రైతుల ఆర్థిక స్థాయి గణనీయంగా రెట్టింపు అయింది. ఈ ప్రాంతం, వాతావరణ పరిస్థితులు కంపెనీలు, డీలర్లు, ఆర్గనైజర్లు, రైతు అభివృద్ధి, ప్రోత్సాహం దిశగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. పత్తి పంట ద్వారా రెట్టింపు స్థాయిలో దిగుబడులు, లాభాలు వస్తున్నాయి. రైతులు పత్తి పంటను అధికంగా నమ్ముతున్నారు.

– పుల్లా శివ ప్రసాద్, రైతు, రామారావుగూడెం

చేబ్రోలు పీహెచ్‌సీలో నూతన భవనానికి భూమి పూజ



చేబ్రోలు పీహెచ్‌సీలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమర్జెన్సీ వైద్య సేవల కోసం పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ నిర్మించనున్న ప్రత్యేక గదికి సోమవారం భూమి పూజ చేశారు. టెంకాయలు కొట్టి పనులను సంస్థ మేనేజరు ఎస్‌ఏ ఖాన్ ప్రారంభించారు. భూమిపూజ కార్యక్రమంలో సర్పంచి రందే సునీత, బొమ్మిడి అప్పారావు, పీహెచ్‌సీ డాక్టర్లు వర్మ, రెడ్డి, సివిల్ ఇంజనీరు సాంబశివరావు, మెకానికల్ ఇంజనీరు రమణమూర్తి, ఎలక్ట్రికల్ ఇంజనీరు రాజేష్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను విస్మరించిన ప్రభుత్వం

భీమడోలు: నాలుగు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం పాలనాపరంగా పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ భీమవరం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలోకి తొక్కిందన్నారు. పేదలంతా పస్తులుంటే కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాలు చేపట్టడం దారుణమని అన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అటకెక్కించారన్నారు. ఈ ప్రభుత్వంలో మద్యాన్ని తక్కువ ధరకే అందిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వానికి నిత్యావసర ధరలు ఆకాశన్నంటుతున్నా కనిపించడం లేదా అని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాలనను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని, తగిన సమయంలో వారంతా గుణపాఠం చెప్తారన్నారు.

దాత సహాయంతో ఆలయంలో అభివృద్ధి పనులు



జంగారెడ్డిగూడెం రోడ్డు నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు నిర్మించిన తారు రోడ్డు



భక్తుల సౌకర్యార్థం నిర్మించిన కల్యాణ మండపం

దెందులూరు: భక్తుల పాలిట కొంగు బంగారంలా కోస్తా జిల్లాల్లో పూజలందుకుంటున్న అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని తమ కుటుంబానికి ఇలవేల్పుగా భావిస్తామని గ్రామానికి చెందిన దాతలు వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ అన్నారు. సోమవారం గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రూ.50 లక్షలతో కల్యాణ మండపం, తారు రోడ్డు నిర్మించామన్నారు. ఇప్పటి వరకు అమ్మవారి ఆలయానికి రావడానికి భక్తులు ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పటి నుంచి భక్తుల సౌకర్యం కోసం కార్లు, ఆటోలు, ట్రాక్టర్లతో నేరుగా ఆలయానికి వచ్చేయవచ్చన్నారు. వెయ్యి మంది భక్తులకు సరిపడేలా కల్యాణ మండపాన్ని ఉత్సవాలు, శుభకార్యాలకు అనుగుణంగా నిర్మించామన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభం



చేబ్రోలులో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: చేబ్రోలు, గోపినాథపట్నం, రామచంద్రపురం, వెల్లమిల్లి, ఉప్పాకపాడు, బాదంపూడిలో రూ.66.50 లక్షలు వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా వెల్లమిల్లిలో రూ.10 లక్షల వ్యయంతో, చేబ్రోలులో రూ.15 లక్షల వ్యయంతో, గోపినాథపట్నంలో రూ.15 లక్షల వ్యయంతో, రామచంద్రపురంలో రూ.4లక్షల వ్యయంతో, బాదంపూడిలో రూ.10 లక్షల వ్యయంతో, ఉప్పాకపాడులో రూ.12.50 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రహదార్ల పనులను, చేబ్రోలు సబ్‌స్టేషన్‌లో ఆల్టనేటివ్ సప్లై బ్రేకర్ చార్జర్‌ను ధర్మరాజు ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, ఆయా శాఖల అధికార్లు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో షెడ్డు నిర్మాణం

పెదపాడు: స్రవంతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అప్పనవీడులోని జేఎంజే మహి ళా కాలేజీ ఆవరణలో రూ.4లక్షల వ్యయంతో వెయిటింగ్ షెడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆ ట్రస్టు చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ శ్రీదేవి దంపతులు ఆర్థిక సాయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో పేద విద్యార్థుల కోసం చేపట్టే కార్యక్రమాల్లో భాగంగానే జేఎంజే కాలేజీలో ప్రిన్సిపాల్ అంథోనమ్మ కోరిక మేరకు ఈ నిర్మాణం చేపడుతున్నామని ట్రస్టు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నర్సింహరావు, వైస్ ప్రిన్సిపాల్ దేవినేని పద్మావతి, సిస్టర్ రాణి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి ఊరేగింపు



గణపవరంలో కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు



ఉంగుటూరులో ఊరేగింపు సందడి



దెందులూరు: గాలాయాగూడెంలో మేళతాళాలతో అమ్మవారి విగ్రహం ఊరేగింపు



రామచంద్రపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. గణపవరంలోని కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన పూలవాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. తొలుత అమ్మవార్లకు ఆసాదులు గరగల సేవ నిర్వహించారు. బ్యాండు మేళాలు, శక్తివేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, డప్పుల మోతలతో అమ్మవార్లను ఊరేగించారు. తోటలో, చినరామచంద్రపురంలో ఇందిరమ్మ కాలనీ, బస్టాండు సెంటర్ వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాలు ముగిశాయి. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు

ఉంగుటూరు: శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా గ్రామాల్లో అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు గ్రామాల్లో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఊరేగింపు తరువాత గోదావరి కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉంగుటూరు, కైకరం, నారాయణపురం, చేబ్రోలు, బాదంపూడిలో నిర్వహించారు. మెట్టప్రాంత గ్రామాల్లో చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. ఉంగుటూరు తూర్పు కాపుల కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నారాయణపురం వంతెన సెంటర్లో కనకదుర్గమ్మను డప్పవాయిద్యాలు శక్తి వేషాలు నడుమ ఊరేగించారు.

అచ్చమ్మ తల్లి ఊరేగింపు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అచ్చమ్మ తల్లి ఆలయం నుంచి గాలాయగూడెం, గోపన్నపాలెంలో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు


పెదపాడు: అమ్మవారి ఉత్సవాలు ఆఖరి రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. పెదపాడు శివారు రామచంద్రపురంలో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు కోలాట నృత్య ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చి, డప్పు వాయిద్యాలతోను గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకుడు రెల్ల రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఖరీఫ్ సాగుకు తెగుళ్ల బెడద

- ఉధృతంగా ఎండాకు తెగులు
- వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలతో వ్యాప్తి
- ఆందోళన చెందుతున్న రైతులు



ఎండాకు తెగులు సోకిన వరి పైరు



బ్యాక్టీరియా ఎండాకు తెగులు

గణపవరం: రెండు వారాలుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల ప్రభావం ఖరీఫ్ పంటపై పడింది. పగలు వేసవిని తలపించేలా విపరీతమైన ఎండలు, ఉన్నట్టుండి ఆకస్మాత్తుగా ఆకాశం మబ్బులతో నిండి వర్షాలు పడటం, రాత్రివేళల్లో మంచు కురియడం వంటి పరిస్థితులతో ఖరీఫ్ పంటను రకరకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. సూర్యోదయం నుంచే విపరీతమైన ఎండ కాయడంతో పాటు ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న విపరీత మార్పుల కారణంగా వరి పంటపై బ్యాక్టీరియా ఎండాకు తెగులు ముప్పేట దాడిచేసి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. దీని కారణంగా దిగుబడిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

30 శాతం పైరుకు ఎండాకు తెగులు

ఉంగుటూరు నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 62 వేల ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. దీనిలో దాదాపు 30 శాతం పైరు ఎండాకు తెగులుకు గురైనట్లు అంచనా. ఎండలు తగ్గి వర్షాలు పడటంతో పదిరోజులుగా ఎండాకు తెగులు వ్యాప్తి అదుపులోకి వచ్చిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఖరీఫ్‌లో ఎక్కువగా స్వర్ణ రకం, సంపద రకాలు సాగు చేస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో వరి ఈనిక దశలో ఉంది. భారీ వర్షాలు, వరదల కారణంగా పైరు కుళ్లిపోయి రెండోసారి నాట్లు వేసిన పొలాలు, ఆలశ్యంగా నాట్లువేసిన పొలాల్లో పైరు దుబ్బుచేసే దశలోనూ, చిరుపొట్ట దశలోనూ ఉన్నాయి.

ఎండాకు తెగులు గుర్తించడం ఇలా

వరి దుబ్బు చుట్టూ ఉన్న ఆకులు పసుపు రంగులోకి మారి తర్వాత ఎండిపోతాయి. ఈనిక దశలో ఉన్న దుబ్బులకు ఈనిక రాకుండా దిగుబడి తగ్గిపోతుంది తెగులు సోకిన వరి మొక్క ఆకులపై బూడిద రంగు మచ్చలు ఏర్పడి వాటి నుంచి తెల్లగా జిగురు పదార్థం స్రవిస్తుంది. ఎండాకు తెగులు ఒక దుబ్బు నుంచి మరో దుబ్బుకు వేగంగా వ్యాపిస్తుంది. వరికి సోకే తెగుళ్లన్నింటిలోకి ఎండాకు తెగులు ప్రమాదకరమైనది. చిరుపొట్ట, గింజ పాలుపోసుకునే దశలో ఈ తెగులు ఆశిస్తే గింజ గట్టిపడకుండా చేయడంవల్ల దిగుబడిపై గణనీయంగా ప్రభావం చూపుతుంది. ఈతెగులు వ్యాప్తి చెందకుండా రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బంది పొలం బడి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నత్రజని వాడకం నిలిపివేయాలి



వాతావరణ మార్పులు కారణంగా ఖరీఫ్ పైరుకు ఎండాకు తెగులు అధికంగా ఆశిస్తుంది. వారంరోజుల వరకూ ఉధృతంగా వ్యాప్తి చెందిన ఈ తెగులు వారం రోజులుగా వర్షాలు పడటంతో కొంత అదుపులోకి వచ్చింది. ఈతెగులు పూర్తిగా నిర్మూలన చేయడం జరగదు. కాని సస్యరక్షణ చర్యల ద్వారా వ్యాప్తిని అదుపులో ఉంచవచ్చును. ఎండాకు తెగులు నివారణకు నత్రజని వాడకం పూర్తిగా నిలిపివేయాలి. పంట చేలోని మురుగు నీరు బయటకు తీసివేయాలి. ప్లాంటామైసిన్, బ్యాక్టీరియామైసిన్ 100 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఎండాకు తెగులు అధికంగా ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– యర్రంశెట్టి ప్రసాద్, ఏవో

రేపు కొలనువాడ శత జయంత్యుత్సవం

దెందులూరు: సంఘ సేవకుడు, చల్లచింతలపూడి మాజీ సర్పంచ్ కొలనువాడ సత్యనారాయణరాజు శత జయంత్యుత్సవం బుధవారం చల్లచింతలపూడి, తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీపీ కొలనువాడ కృష్ణరాజు అన్నారు. సత్యనారాయణరాజు చల్లచింతలపూడి గ్రామానికి 11 ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలంచారు. గ్రామాభివృద్ధికి ఆయన అందించిన సేవలను దృష్టిలో పెట్టుకుని శత జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తనయుడు కృష్ణంరాజు అన్నారు.